క్లుప్తంగా

వైఎస్సార్ నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, జీవీఎంసీ అధికారులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వైఎస్సార్ నగర్‌లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ కంపా హనోకు, జీవీఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో జీవీఎంసీ నిధులు రూ.19.5 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ బి.రాము, డీఈ రామసుబ్బారావు, ఏఈ ఉమామహేశ్వరరావు, కూటమి నాయకులు శ్యామలాదీపిక, పైలా ముత్యాలనాయుడు, పలిశెట్టి అప్పన్న, భరణి కాన రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వేత్తకు సన్మానం



బంగార్రాజును సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మద్రిపాలెం: ఆధ్యాత్మిక వేత్త సనపల బంగార్రాజును హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మాధవధారలోని ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మూడు రోజుల పాటు నిర్వహించిన నాటకోత్సవాలకు బంగార్రాజు ఆర్థిక సాయం అందజేయడంతో సన్మానించామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు, కార్యదర్శి శివ ప్రకాష్, సనపల ప్రభాకరరావు, వ్యాపారవేత్తలు అనిల్‌కుమార్, భాస్కరరావు, నాటకోత్సవాల కన్వీనర్ రాంబాబు, చంద్రరావు, రమణ, మూర్తి, దుర్యోధనరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ దాశరథి

మద్రిపాలెం: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి మంగళవారం కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకులను ఆపి వారికి హెల్మెట్ ధరింపజేశారు. హెల్మెట్ ధారణపై ట్రాఫిక్ సీఐ దాశరథి కౌన్సెలింగ్ ఇచ్చి, వారి వాహనాల రికార్డులను పరిశీలించారు. సురక్షితమైన ప్రయాణాలు కొనసాగించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.


'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చలో ఢిల్లీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను అమలు చేయడంలో వివిధ రాష్ట్రాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు..అధికారం చేపట్టిన 9 నెలలైనా ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. భవనిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోటా సత్తిబాబు, నాయకులు కూన కృష్ణారావు, ఎ.మదన్‌మోహన్, లక్ష్మీనారాయణ, వినోద్, కలిశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుణం



తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం వెళ్లే రహదారిలో ప్రమాదకర గోతులు



కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం వెళ్లే రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఇలా...



స్పీడ్‌బ్రేకర్ల వద్ద వాహనాల రద్దీ..

- ఎక్కువ ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- రహదారుల వెంబడి వెలగని విద్యుత్ దీపాలు

కంచరపాలెం: అసలే అంతంత మాత్రం రహదారులు. ఎక్కడ చూసినా గోతులతో దర్శనమిస్తున్నాయి. వీటికి ఎత్తుగా నిర్మించిన స్పీడ్‌బ్రేకర్లు వాహనదారులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నాయి. కంచరపాలెం నేతాజీ వంతెన కూడలి నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వీఐపీ రహదారికి వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. అటు అధికారులు, ఇటు నాయకులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహ నదారులకు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం కలుగు తోంది. రహదారులు గోతులమయంగా మారండంతో పాదచారులు, ద్విచక్ర వాహన దారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో రహదారులను మెరుగు పరుస్తున్నట్టు బిల్డప్ తప్ప..వాస్తవానికి రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంలో రహదారులకు నామమాత్రపు మరమ్మతులు చేసి చేతులు దులుపేసుకుంటున్నారు. ఇటీవల జీవీఎంసీ జోన్–5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో భారీ ఎత్తున స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అసలే గోతులమయంగా ఉన్న రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు వేశారు. వాటిపై నుంచి వెళ్లేటప్పుడు వాహనాల అడుగుభాగం తగలడంతో పాడవుతున్నాయి. ఒక్కోసారి వాహనదారులు అదుపు తప్పుతున్నా రు. నాలుగు చక్రాల వాహన దారులు తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. రాత్రి సమయంలో మరీ ఇబ్బందులు తప్పడం లేదు. తాటిచెట్లపాలేనికి వెళ్లే రహదారికి విద్యుత్ స్తంభాలకు లైట్లు అమర్చడం మర్చిపోయారు. దీంతో చీకట్లో ప్రయాణించేటప్పు డు స్పీడ్ బ్రేకర్ల ఎత్తు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

స్పీడ్ బ్రేకర్లు వేశారు.. రంగులు మరిచారు

సాధారణంగా స్పీడ్ బ్రేకర్ల ఎత్తు 10 సెం.మీ ఉండాలి. వెడల్పు 3.7 మీటర్లు ఉండాలి. గుండ్రని ఆకృతిలో ఏర్పాటు చేయాలని ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కోడ్ 99 సిఫార్సు చేసింది. అంతేకాకుండా వాటికి రంగులు కూడా వేయాలని సూచించింది. అయితే జీవీఎంసీ అధికారులు మాత్రం ఏదో తూతూ మంత్రంగా పనులు కానిచ్చేస్తున్నారు. కాంట్రాక్టర్లు సరిగా పనులు చేయకపోయినా పట్టించుకోవడం లేదు. కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం వెళ్లే ప్రాంతాల్లో తిక్కవానిపాలెం, ధర్మానగర్, బీఎస్‌టీఎస్–1 కాలనీ, తదితరులు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం

నగరంలో వీధి దీపాల సమస్య అస్తవ్యస్తంగా ఉంది. వీటి నిర్వహణ.. పర్యవేక్షణ గాలికొదిలేశారు. దీంతో రాత్రి సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతుండగా..ఆకతాయిలు కొందరు వాహనదారులను అడ్డగిస్తున్నారు.



ధర్మానగర్ వద్ద ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్



కంచరపాలెం - తాటిచెట్లపాలెం రహదారిలో లైట్లు లేని విద్యుత్ స్తంభాలు

ప్రమాదాలు జరుగుతున్నాయి



ప్రమాదకర రహదారుల్లో ప్రయాణం నరకంగా ఉంది. అటుగా రాకపోకలు చేసేటప్పుడు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఇక్కడి రహదారుల్లో విద్యుత్ లైట్లు ఉండకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

– రాంప్రసాద్, ఐటీఐ జంక్షన్

అధికారులు స్పందించాలి



విద్యుత్ లైట్లు వేయకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నాం. వీఐపీ రహదారిలో స్పీడ్‌బ్రేకర్లకు రంగులు, లైట్లు వేయాలి. రహదారులు, విద్యుత్ దీపాల సమస్యపై అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇప్పటికైనా స్పందించాలి.

– ఆతవ రాంబాబు, కంచరపాలెం

మాజీ సీఎం జగన్‌ను కలిసిన కె.కె.రాజు



వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయ **కర్త, నెడ్‌క్యాప్ మాజీ** చైర్మన్ కె.కె.రాజు తన **చిన్న కుమార్తెతో** కలిసి మంగళవారం విజయ **వాడలో మాజీ ముఖ్యమంత్రి**, పార్టీ అధినేత **వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**ని మర్యాదపూర్వకం**గా కలిసి, కాసేపు** చర్చించారు. తన కుమార్తెను **ఆయనకు పరిచయం** చేశారు. పాపతో **వైఎస్ జగన్ చిట్‌చాట్** చేసి, బాగా చదుకోవాలని **ఆశీర్వదించారు.**

– సీతమ్మధార

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



80 ఫీట్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపజేస్తున్న ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు

సీతంపేట: జీవీఎంసీ 43, 44 వార్డుల పరిధిలోని అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై 'కాలిబాటలు కనుమరుగు' అనే శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురించిన కథనానికి ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ సీఐ అమ్మి నాయుడు తక్షణం స్పందించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి, ట్రాఫిక్ పోలీసులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మహారాణి పార్లర్ నుంచి కేంద్రీయ విద్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన జ్యూస్ షాప్‌లు, బిర్యానీ పాయింట్లు, కర్రీ పాయింట్లు, ట్రైర్లను తొలగించారు. ఫుట్‌పాత్‌పై నిర్మించిన రేకుల షెడ్‌ను తొలగించాలని వెల్డింగ్‌షాపు యజమానికి ఆదేశించారు. 24 గంటల్లో తొలగిస్తానని అతడు సమయం కోరాడు. మహారాణి పార్లర్ ఎదురుగా ఫుట్‌పాత్‌ను మూసివేసి నిర్వహిస్తున్న జ్యూస్ షాపు కౌంటర్‌ను తొలగించారు. జ్యూస్ షాపు ముందు వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, రోడ్డుపై వాహనాలు నిలపకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహారాణి పార్లర్ ముందు ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన జ్యూస్ షాపును వెనక్కి జరిపించారు. ఈ సందర్భంగా సీఐ అమ్మి నాయుడు దుకాణాల యజమానులతో మాట్లాడుతూ పాదచారులు నడవడానికి ఫుట్‌పాత్‌లు నిర్మించారని, వాటిని వ్యాపార అవసరాల కోసం ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భవిత కేంద్రాల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక



మాట్లాడుతున్న గొండు సీతారాం

సీతంపేట: దివ్యాంగ పిల్లలను మానసిక, సామాజిక అభివృద్ధిలో ముందంజలో ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ప్రాంగణంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సిబ్బంది, అధికారులు, పిల్లల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ప్రత్యేక బోధన విధానాలతో తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు ఎంతమంది, వారెక్కడ శిక్షణ పొందారు, పిల్లలకు బ్రెయిలీ లిపి, సంజ్ఞా భాష, స్పీచ్ థెరపీ వంటి విద్యా విధానాలు ఎలా అమలు చేస్తున్నారు అనే విషయాలను సర్వశిక్షా అభియాన్ పథకం ఏపీసీ జె.చంద్రశేఖర్, జిల్లా కో ఆర్డినేటర్ బి.గీతలను ఆయన అడిగి తెలుసుకున్నారు. హియరింగ్ ఎయిడ్స్, వీల్ చైర్స్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎంతవరకు ప్రవేశపెట్టగలిగారు, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో ఇంక్లుసివ్ ఎడ్యుకేషన్‌ను ఏయే రూపాల్లో ప్రోత్సహిస్తున్నారు, కొత్త అడ్మిషన్లు ఎలా జరుగుతున్నాయో వివరాలు సేకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో భవిత కేంద్రంలో పిల్లలకు ఇస్తున్న శిక్షణ ఫలితాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ భవిత కేంద్రాల్లోని సమస్యలపై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ రమణకుమారి, సీతమ్మధార మండల విద్యా శాఖాధికారులు రామారావు, బాలా మణి, బాల్యం ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మోహన్ కుమార్, హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీ నరస, భవిత సిబ్బంది చంద్రకళ, జగదాంబ, చైల్డ్ అవేర్‌నెస్ ఫోరం ప్రతినిధి ఎం.హరీష్ కుమార్ పాల్గొన్నారు.

పక్కాగా డ్రాపౌట్స్ సర్వే

జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్



నేవల్ చిల్డ్రన్ స్కూల్ సిబ్బందికి సూచనలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం: డ్రాపౌట్స్ పిల్లల వివరాలను పక్కాగా సేకరించి వాటికి సరైన కారణాలను సీఎస్ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. గోపాలపట్నం మండల పరిధి 104 ఏరియాలోని నేవల్ చిల్డ్రన్ పబ్లిక్ స్కూల్‌ను మండల విద్యా శాఖాధికారి డి.దివాకర్‌తో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మండలంలో 3,257 మంది డ్రాపౌట్స్ పిల్లలకు గాను 2,199 మంది కారణాలను మాత్రమే సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారని, మిగిలిన పిల్లల వివరాలను తక్షణమే నమోదు చేయాలని ఆదేశించారు. నేవీ స్కూల్ పిల్లలు ఇతర రాష్ట్రాలకు వలస పోవడంతో.. వారు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలుసుకుని ఆయా పాఠశాలల వివరాలను సేకరించాలన్నారు. ప్రతి పాఠశాల యాజమాన్యం తమ స్కూల్ డ్రాప్ బాక్స్‌లో పెండింగ్ లేకుండా తక్షణమే క్లియర్ చేయాలని సూచించారు.

నేడు జాబ్ అచీవర్స్ డే

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం జాబ్ అచీవర్స్ డే నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ సెక్రటరీ ప్రొఫెసర్ పి.సోమరాజు ముఖ్య అతిథిగా, వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ఎం.వినయ్‌కుమార్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

సిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు



మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్ లో కొలువైన యోగ సిద్ధాంజనేయ స్వామి కి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి, పాంచరాత్ర ఆగమ సంప్రదాయాలతో ఆలయ అర్చకుడు శ్రీకాంత్ ఆచార్యులు సింధూర అర్చన, తమలపాకు పూజలు చేశారు. అనంతరం వడమాల సమర్పించారు. సామూహికంగా భక్తులచే సుందరాకాండ పారాయణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, కమిటీ సభ్యుడు ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

మానసిక రోగికి వైద్య సేవలు



మానసిక రోగిని ఏయూటీడీ షెల్టర్‌లో చేర్పిస్తున్న పీఎం పాలెం పోలీసులు

సీతమ్మధార: ఫొటోలో ఉన్న వద్ధురాలు మానసిక రోగి. ఊరు తెలియదు. సుమారు 65 ఏళ్ల ఉంటాయి. గతంలో పీఎం పాలెం పోలీసుల ద్వారా రెస్క్యూ చేసి ఈమెను అత్యవసరంగా కేజీహెచ్ సేవా వార్డులో చేర్పించగా..అక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పుడు రెండోసారి పీఎంపాలెం పోలీసులు ఈ వద్ధురాలిని ఏయూటీడీ–జీవీఎంసీ టి.యస్.ఆర్ షెల్టర్‌కి తీసుకొచ్చారు. షెల్టర్‌లో ఉన్న వారిపై ఈమె దాడి చేస్తుండడంతో ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తున్నారు.

చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం

- కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించిన ఏడీసీపీ
- పాత నేరస్తులే చోరీ చేసినట్లు పోలీసుల అనుమానం



రెయ్యి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏడీసీపీ మోహనరావు

సీతమ్మధార: అక్కయ్యపాలెంలో ఓ ఇంట్లో జరిగిన చోరీపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మహారాణి పార్లర్ సమీపంలోని సరోజా ఆస్పత్రికి కొద్ది దూరంలో వాసుదేవరావు, లక్ష్మీకాంతమ్మ నివాసంలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. మంగళవారం ఏడీసీపీ మోహనరావు చోరీ జరిగిన ఇంటికి వెళ్లి పరిశీలంచారు. జరిగిన ఘటనపై ఫిర్యాదు దారుడు రెయ్యి శ్రీనివాసరావు(వాసుదేవరావు కుమారుడు)తో పాటు పలువుర్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే నాలుగు బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇంటి చుట్టు పక్కల సీసీ కెమెరాలు లేకపోవడంతో పోలీసులు ఈ కేసు పెద్ద సవాల్‌గా మారింది. చేతి వేలిముద్రలు కూడా లభ్యంకాలేదు. ఆధారాలు కోసం పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. కొంత మంది పాతనేరస్తులను సీసీఎస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. బాగా తెలిసినవారే చోరీకి పాల్పడినట్లు , ముందుగా రెక్కీ నిర్వహించి చోరీ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మొత్తం 17 తులాల బంగారం వస్తువులతో పాటు రూ.25 వేలు చోరీ అయ్యాయని బాధితుడు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

గజిబిజిగా వాహనాల రాకపోకలు

- రాంగ్ రూట్ ప్రయాణాల జోరు
- స్థానికులు, పాదచారుల బేజారు
- సీతమ్మధార–నక్కవానిపాలెం రహదారిలో ఇదీ పరిస్థితి



నక్కవానిపాలెం మెయిన్ రోడ్డులో రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధార – నక్కవానిపాలెం మెయిన్ రోడ్డులో రాంగ్ రూట్ ప్రయాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇక్కడ ఒకవైపు కేఆర్ఎం కాలనీ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు ఉండగా.. ఎదురుగా ఉన్న నక్కవానిపాలెం ప్రధాన రహదారిలో రాంగ్ రూట్‌లో దూసుకొచ్చే వాహనాలతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు, పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఎంజీ ఆస్పత్రి మీదుగా వాహనాలపై వచ్చే పలువురు టీపీటీ కాలనీ మీదుగా గురుద్వారా చేరుకునేందుకు తరచూ రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ స్థానకులకు భయాందోళనలకు గురిచేస్తున్నారు.

నిత్యం వాహనాలతో రద్దీ

ఈ మార్గం నిత్యం వాహనాలు, పాదచారులతో రద్దీగా ఉంటుంది. ఈ రహదారిలో 69 రూట్ నంబర్ సిటీ బస్సులు, రైతుబజార్ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో కార్లు, ఆటోలను ఇష్టానుసారంగా పార్క్‌చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ రోడ్డులో పార్లర్లు, నూడిల్స్ తదితర ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు అధిక సంఖ్యలో ఉండటంతో అక్కడికి వచ్చే వాహనాలతో రద్దీ నెలకొంటోంది. ఈ మార్గంలోని యూనియన్ బ్యాంకుకు వచ్చే వినియోగదారులు కూడా అక్కడే వాహనాలు పార్క్‌చేయడం గమనార్హం.

రోడ్డు మీదే పార్కింగ్

సీతమ్మధార మెయిన్ రోడ్డులోని వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను సెల్లార్‌కు బదులుగా రోడ్డు మీదే నిలుపుతున్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించే వాహనాల కారణంగా వెనుక నుంచి వచ్చే వాహన చోదకులకు అవి కనిపించకపోవడంతో ఇటీవలే ఐదు ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి

కేఆర్ఎం కాలనీ, నక్కవానిపాలెం, సీతమ్మధార, టీపీటీ కాలనీ, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల వాసులు ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఆక్సిజన్ టవర్స్ ఏరియా, తహసీల్దార్ కార్యాలయం, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలు ఈ మార్గం ద్వారానే ప్రయాణిస్తారు. నిత్యం ఇక్కడి మెయిన్ రోడ్డు మీద రాంగ్ రూట్‌లో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా.. ట్రాఫిక్ పోలీసులు పత్తా లేరని స్థానికులు, పాదచారులు ఆరోపిస్తున్నారు. ద్వారకా సబ్ డివిజన్ పరిధిలోని ఎంవీపీ, ద్వారకా ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి రాంగ్ రూట్ ప్రయాణాలకు అడ్డుకట్ట వేయాలని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

21 నుంచి నవ రచయితల శిబిరం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ దేశాలయం, న్యూఢిల్లీ సౌజన్యంతో హిందీ విభాగ ఆధ్వర్యంలో 8 రోజుల నవ రచయిత శిబిర నిర్వహిస్తున్నట్లు కాలేజీ కన్వీనర్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. కళాశాల సెమినార్ హాల్‌లో మంగళవారం శిబిరం పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 28 వరకు హిందీయేతర విద్యార్థులకు హిందీ నవ లేఖకుల శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. 8 రోజులు పాటు జరిగే ఈ శిబిరంలో వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొంటారని చెప్పారు.

ఘనంగా ముత్యాలమ్మ మారువారం



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ



ఉత్సవాల్లో పాల్గొన్న సాది పద్మారెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మారువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాలమ్మ ప్రత్యేకాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ఆవరణలో భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. అమ్మవారిని నక్కవానిపాలెం, గాంధీ నగర్, రేసపువానిపాలెం, క్రాంతినగర్, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం,సీతమ్మధార, హెచ్‌బీ కాలనీవాసులు దర్శించుకున్నారు. అనంతరం 24 వార్డు కార్పొరేటర్ సాది పద్మారెడ్డిని, డీవీఎస్ ప్రసాద్‌రెడ్డిని, దళ్లి రామకృష్ణారెడ్డిని గ్రామ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గుడ్ల కాటరాజురెడ్డి, కమిటీ ఉపాధ్యక్షుడు బోర రవికుమార్‌రెడ్డి, కార్యదర్శి కారపురెడ్డి శ్యామ్‌రెడ్డి, నందిక వేణురెడ్డి, కోశాధికారి ధర్మాల గురుమూర్తిరెడ్డి, బర్ల బాలకృష్ణ, గుప్తాజీ, నక్క అప్పలరెడ్డి, కోన గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడిమాంబ పండగ



పైడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట వాసుల ఆరాధ్య దైవత పైడిమాంబ అమ్మవారి మారువారం జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు వి.ఆంజనేయశర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక దర్శనాల కోసం భక్తులు బారులు తీరారు. ట్రస్టు సభ్యులు భక్తులకు మజ్జిగ, ప్రసాదం వితరణ చేశారు. ఆలయ పరిసరాల్లో భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో సుమారు 10 వేల మందికి భారీ అన్నసమారాధన చేశారు. సాయంత్రం మారువారం జాతరలో కోలాటాలు, తప్పెడుగుళ్లు, నేలవేషాలు నడుమ అమ్మవారి ఉత్సవ ప్రతిమను ఊరేగించారు. గ్రామాధ్యక్షుడు కొణతాల గోవింద్‌రాజు, కార్యదర్శి బొడ్డేటి నర్సింగరావు(చిన్న),ఉపాధ్యక్షుడు బొడ్డేటి పైడిరాజు,శ్రీనువాస్ ,పాలవర్గ సభ్యులు కె.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, బి.పైడిరాజు ఎ.పైడిరాజు, కె.సురేష్, బి.శేఖర్, ఎం.అప్పారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.